సాక్షి
పల్నాడు
బుధవారం : 30 : ఏప్రిల్ : 2025



ఘనంగా బాలయేసు చర్చి తిరునాళ్ల

నాదెండ్ల: కనపర్రులోని బాలయేసు పుణ్యక్షేత్ర తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. ఫాదర్ జోజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



కార్యసిద్ధి ఆంజనేయుడికి పూజ

సత్తెనపల్లి: నాగన్న కుంటలో వేంచేసి ఉన్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆంజనేయుడికి నాగవల్లీదళార్చన



ఫిరంగిపురం: దక్షిణాముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేసి నాగవల్లీదళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు.

నాడు భళా.. నేడు బలి

- గతేడాది క్వింటా రూ.13 వేలు నుంచి రూ.15 వేలు పలకడంతో భారీ లాభాలు
- ఈ ఏడాది సాధారణ విస్తీర్ణానికి మించి సాగుచేసిన పల్నాడు రైతులు
- పంట చేతికందేసరికి దారుణంగా పడిపోయిన ధర
- తీవ్ర నష్టాల్లో పొగాకు రైతులు
- క్వింటాకు కనీసం రూ.4 వేలు కూడా దక్కని పరిస్థితి
- కంపెనీలు కొనలేమని చెప్పడంతో తేమశాతం పేరుతో దోచుకుంటున్న వ్యాపారులు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

బర్లీ పొగాకు రైతుల దుస్థితి



అచ్చంపేటలో సాగు చేసిన పొగాకు పంట

సాక్షి, నరసరావుపేట: పొగాకు రైతులు ఈ ఏడాది తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వైట్, బ్లాక్ రెండు రకాల బర్లీ సాగు చేస్తారు. అయితే రెండు రకాల రైతులు నష్టాల్లో ఉన్నారు. పెట్టిన పెట్టుబడి సైతం రాని పరిస్థితి నెలకొంది. గతేడాది పొగాకు జిల్లావ్యాప్తంగా సుమారు 1500 ఎకరాల్లో సాగు చేశారు. వారికి ఎకరానికి సుమారు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర దాకా లాభం వచ్చింది. దీంతో ఈ ఏడాది సాగు మూడింతలు పెరిగింది. సుమారు 5 వేల ఎకరాల్లో పంట సాగుచేసిన రైతులకు ప్రస్తుతం కొంతమంది ఆకు తీసిన కూలీల డబ్బు కూడా రాని పరిస్థితి నెలకొని ఉండటంతో చాలా మంది రైతులు కోయకుండా ఆపేస్తున్నారు. పొగాకు కొంటామని చెప్పిన బహుళజాతి సంస్థలు ఈ ఏడాది పొగాకు కొనడానికి ముందుకు రాకపోవడంతో వ్యాపారులు చెప్పిందే వేదమయ్యింది. గతేడాది రూ.12 వేలకు పైగా పలికిన నల్ల బర్లీకి ఈ ఏడాది కనీసం రూ.4 వేలు ఇవ్వమన్నా ఇవ్వకుండా వ్యాపారులు బెట్టుచేస్తున్నారు.

తగ్గిన దిగుబడి, ధర...

పొగాకు రైతుకు ఈ ఏడాది రెండు రకాలుగా దెబ్బ తగిలింది. ఒక వైపు దిగుబడి తగ్గడంతో పాటు మరోవైపు భారీగా ధర తగ్గడంతో రైతు తీవ్ర నష్టాల్లో ఉన్నాడు. క్వింటా ఆకు గుచ్చేందుకు 10 మంది కూలీలు అవసరం, ఒక్కొక్క కూలీకి రోజుకు రూ.800 వేతనం చెల్లించాలి. నారు, సాగుకు కలిపి రూ.9 వేలు ఖర్చులు ఉండగా, కూలీలు, ఇతరత్ర పై ఖర్చులకు రూ.6వేల నుంచి రూ.7 వేల వరకు పెట్టాల్సి వస్తుంది. కౌలు డబ్బులు అదనం. వెరసి ఎకరాకు రూ.లక్షన్నర దాకా పెట్టుబడి అవుతుంది.

గణనీయంగా పెరిగిన సాగు

గతేడాది ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్లు వచ్చింది. రూ.15 నుంచి రూ.18 వేల వరకు ధర పలికి రైతులకు ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర మిగిలిన రైతులు ఉన్నారు. వారిని చూసే ఈఏడాది పొగాకు అధికంగా సాగు చేశారు. ఈ ఏడాది ఎకరాకు 14 క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. ఈ ఏడాది నంబర్ వన్ క్వాలిటీ రూ.10 నుంచి 12వేలు ఇస్తున్నారు. గతేడాది పనికిరాని సూరసైతం (గుల్లాకు) కూడా రూ.4వేలకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది మంచి ఆకు కూడా ఆ ధరకు కొనుగోలు చేయక పోవడం దారుణం. ప్రభుత్వం ఇప్పటికైనా పొగాకు రైతుల పరిస్థితిని గమనించి క్వింటాకు రూ.15 వేలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పొలాల్లో ఎండబెట్టిన పొగాకు

ప్రభుత్వం ఆదుకోవాలి...



మూడేళ్లుగా పొగాకు సాగు చేస్తున్నాను. ఈ ఏడాది 14 ఎకరాలు సాగు చేయగా, వీటిలో 11 ఎకరాలు తెల్లబర్లీ, 3 ఎకరాల్లో నల్లబర్లీ(హెచ్‌డీ) రకాల్ని సాగు చేశాను. తెల్లబర్లీ వరకు అయితే కొంత నయం. కాని నల్లబర్లీ సాగు చేసిన రైతులకు మాత్రం పెట్టుబడి రాకపోగా, కనీసం కౌలు డబ్బులు వచ్చే పరిస్థితి లేదు. గతేడాది రూ.15వేల నుంచి రూ.18 వేలు ధర పలికింది. ఈ ఏడాది కనీసం రూ.4 వేలు కూడా అమ్మడం గగనమైంది. ప్రభుత్వం వెంటనే స్పందించి క్వింటా రూ.15 వేలు అమ్ముడయ్యేలా చర్యలు తీసుకోవాలి.

–తంగేడుమల్లి మస్తాన్‌రావు, పొగాకు రైతు, యడ్లపాడు

ఎకరానికి రూ.40వేలు నష్టం



ఈ ఏడాది పొగాకు సాగులో ఎకరానికి రూ.30 నుంచి రూ.40 వేల దాకా నష్టం వస్తోంది. నేను మొత్తం 13 ఎకరాల్లో నల్లబర్లీ సాగుచేశాను. గతేడాది ఎకరాకు 15 క్వింటాలు దిగుబడి రాగా ఈ ఏడాది 12వేలకే పరిమితమైంది. గతేడాది మంచి ధరలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రస్తుతం రూ.3వేలు నుంచి రూ.4 వేలు మాత్రమే వ్యాపారులు కొంటున్నారు. రైతులకు ప్రభుత్వం నుంచి మద్దతు లేదు.

– సాంబయ్య, గణపవరం, నాదెండ్ల మండలం

సగం పంట అమ్ముకోలేకపోయాను...



ఎకరం విస్తీర్ణంలో తెల్లబర్లీ రకం పొగాకు సాగు చేశాను. సుమారు రూ.1.50లక్షలు పెట్టుబడికి అయింది. మొత్తం 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటికి 6 క్వింటాళ్ల మేలు రకం క్వింటా రూ.13 వేలు చొప్పున అమ్ముకున్నాను. మిగిలింది సగం పొలంలోను, మరికొంత పాకాలోను తొక్కి పెట్టి ఉంచాను. గత ఏడాది ఇదే పొగాకు క్వింటా రూ. 25వేలు చొప్పున అమ్ముకున్నాను. ఈ ఏడాది అడిగే వారు లేరని కొంత పొలం లోనే దున్ని వేయాల్సి వచ్చింది.

– గుత్తికొండ వెంకటాచారి, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం

నేడు పాలిసెట్

- గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 4,030 మంది విద్యార్థులు
- నిముషం ఆలస్యంగా వచ్చినా నో... ఎంట్రీ

గుంటూరు ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై ఉద్దేశించిన పాలిసెట్–2025 బుధవారం జరగనుంది. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 4,030 మంది విద్యార్థులకు గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 11 గంటల తరువాత నిముషం ఆలస్యమైనా విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించబోమని పాలిసెట్–2025 సమన్వయకర్త, నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి. శేఖర్ తెలిపారు.

ఇక నుంచి పొగాకు బోర్డులోకి బ్లాక్ బర్లీ !

లక్ష్మీపురం: రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు, రైతుల పోరాట ఫలితంగా బ్లాక్‌బర్లీ పొగాకును పొగాకు బోర్డులోకి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని రైతు సంఘ నాయకులు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాల వరకు బ్లాక్ బర్లీ పొగాకు సుమారు రూ.20వేలు నుంచి రూ.21వేల వరకు క్వింటా ధర పలికింది. ఈ ఏడాది రూ.2వేలు, రూ.3వేలు అని అంటున్నా.. కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ బర్లీ పొగాకు దాదాపు 3 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా గుంటూరు జిల్లాలో 10వేల ఎకరాల్లో వేశారని రైతు సంఘ నాయకులు చెబుతున్నారు. అయితే గతంలో బ్లాక్ బర్లీ సాగు పొగాకు బోర్డులో ఉండేది కాదు. గత కొంత కాలంగా రైతు సంఘ నాయకులు, రైతులు, రైతు కార్మికులు చేస్తున్న పోరాటాలు, విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని బ్లాక్ బర్లీని పొగాకు బోర్డు పరిధిలోకి తీసుకువచ్చింది. దీనిపై రైతు సంఘ నాయకుడు కంచుమాటి అజయ్ హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకులుగా గౌతంరెడ్డి



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా విజయవాడకు చెందిన పూనూరి గౌతంరెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

7న కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం మే 7వ తేదీన జరగనుంది. ఈనెల 25వ తేదీన జరగాల్సిన కౌన్సిల్ సమావేశం మేయర్ ఎన్నిక కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. వాయిదా పడిన సమావేశాన్ని ఏడో తేదీన నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. అందుకు సంబంధించిన సర్క్యులర్ కాపీలను సభ్యులకు మంగళవారం అందజేశారు.

దద్దనాల మిట్ట ఆంజనేయ స్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం సమీపంలో గల దద్దనాల మిట్ట ఆంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవ తిరునాళ్ల మంగళవారం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల వారు అధిక సంఖ్యలో దేవాలయానికి వచ్చి పొంగళ్లు నిర్వహించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. స్వామికి ఇష్టమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో శ్రీమహాలక్ష్మి యాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం శ్రీమహాలక్ష్మి యాగాన్ని నిర్వహించనున్నారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఉదయం 9 గంటలకు యాగం నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. యాగాన్ని దేవస్థానం తరపున ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

వీర్ల అంకమ్మతల్లికి బోనాలు



దాచేపల్లి: వీర్ల అంకమ్మతల్లి కొలువుల తిరునాళ్ల సందర్భంగా మంగళవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో ఉన్న మహిళలు దేవాలయానికి బోనాలతో వచ్చారు. నెత్తిపై బోనాలు పెట్టుకుని మేళతాళాలతో గ్రామ పుర వీధుల్లో నుంచి దేవాలయానికి చేరుకుని చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రత్యేకంగా పూజలు చేసిన తరువాత అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యుడు యలమల నరేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గాయత్రీదేవి శక్తి స్థూపం ఆవిష్కరణ



కర్లపాలెం: గాయత్రీదేవి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆధ్యాత్మికవేత్త రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దమ్మనవారిపాలెం గ్రామంలో పి.వెంకట ప్రసూనాంబ, సునందనరావు దంపతుల ఆధ్వర్యంలో గాయత్రీదేవి స్థూపం ఆవిష్కరించారు. ముందుగా స్థూపం వద్ద శాంతిహోమాలు నిర్వహించారు. అనంతరం గాయత్రీ మహామంత్రం జపించి గాయత్రీదేవికి పూజలు చేశారు. ఆధ్యాత్మికవేత్త రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భూమి, ఆకాశం, అగ్ని, జలం , వాయువు మొదలగు పంచభూతాల సమూహమే గాయత్రీదేవి అని చెప్పారు. విశ్వశాంతి కోసం గాయత్రీదేవిని పూజించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గురపసాల వెంకటేశ్వరమ్మ, మాజీ ఎంపీపీ తాతా లీలావరప్రసాద్, మాజీ సర్పంచ్ అలపర్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే తత్వంతో ఉన్నత స్థానాలకు..



విద్యార్థులతో కలెక్టర్ అరుణ్‌బాబు, చీఫ్ విప్ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ, బ్రహ్మానందరెడ్డి, అధికారులు

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- విద్యాశాఖ ఆధ్వర్యంలో టెన్త్ మెరిట్ విద్యార్థులకు అభినందనలు

నరసరావుపేట: పల్నాడు జిల్లా వెనుకబడిన ప్రాంతమైనప్పటికీ పిల్లలో కష్టపడే తత్వం గుర్తించడం జరిగిందని, అదివారి మంచి భవిష్యత్తుకు దారి తీస్తుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం భువనచంద్ర టౌన్‌హాలులో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల ప్రకటించిన పదోతరగతి ఫలితాల్లో 580 మార్కులకు పైబడి సాధించిన 92 మంది విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పదోతరగతి ఉత్తీర్ణత శాతం 95శాతం నిర్ణయిస్తే, 85 శాతం లభించిందని అన్నారు. కారెంపూడిలో మండలంలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడం అభినందనీయమని చెప్పారు. అత్యధిక మార్కులు సాధించి, జిల్లాలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు శివశక్తి ఫౌండేషన్ తరపున నగదు బహుమతి అందజేశారు. మొదటి రెండు స్థానాలవారికి రూ.25వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.15వేల నగదును అందచేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో 580 మార్కులు వచ్చిన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. అనంతరం మొదటి స్థానం సాధించిన పావని చంద్రిక, ద్వితీయస్థానం సాధించిన షేక్ సమీరాలకు ఎమ్మెల్యే జూలకంటి తన సొంత నిధులు రూ. లక్ష చొప్పున, తృతీయస్థానం సాధించిన ప్రత్తిపాటి అమూల్యకు రూ.50వేల నగదు అందజేశారు. డీఈఓ ఎల్.చంద్రకళ, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బారాయగుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఆత్మహత్యలే శరణ్యం!

- పురుగుమందు డబ్బాలతో రోడ్డెక్కిన మిర్చి రైతులు
- సత్తెనపల్లిలో గుంటూరు – మాచర్ల రహదారిపై టెన్షన్.. టెన్షన్
- పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ



గుంటూరు-మాచర్ల ప్రధాన రహదారిపై పురుగు మందు డబ్బాలతో బైఠాయించిన రైతులు



సత్తెనపల్లిలో రైతుల నుంచి పురుగు మందు డబ్బాలు లాగేసుకుంటున్న పోలీసులు

సత్తెనపల్లి: తమకు న్యాయం చేయాలంటూ పురుగుమందు డబ్బాలతో మిర్చి రైతులు రోడ్డెక్కిన సంఘటన సత్తెనపల్లిలో మంగళవారం జరిగింది. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన మిర్చి వ్యాపారి రావిపూడి తిరుమలరావు లక్కరాజు గార్లపాడు గ్రామంతో పాటు చుట్టుపక్కల రైతులను నుంచి పెద్దఎత్తున మిర్చిని కొనుగోలు చేశాడు. అయితే నగదు చెల్లించకుండా కొద్ది రోజుల క్రితం పరారయ్యాడు. చివరకు లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన రైతులు ఆ వ్యాపారిని పట్టుకొచ్చి పోలీసులకు అప్పగించారు. ఈ నెల 8న గ్రామానికి చెందిన 13 మంది రైతులు తమ వద్ద 381 క్వింటాళ్ల మిర్చిని కొనుగోలు చేశాడని, వాటి నిమిత్తం రూ.41.30 లక్షలు ఇవ్వాలని ఫిర్యాదు చేశారు. ఇంకా చాలామంది రైతులు నుంచి మిర్చి కొనుగోలు చేసినట్లు సమాచారం. వ్యాపారిపై కేసు నమోదు చేసి పోలీసులు కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు. ఈ నెల 26న బెయిలుపై విడుదలయ్యాడు. కానీ ఇంతవరకు రైతులకు న్యాయం జరగకపోవడంతో తమకు ఆత్మహత్యేలు శరణ్యం అంటూ పురుగుమందు డబ్బాలతో సత్తెనపల్లిలోని గుంటూరు – మాచర్ల ప్రధాన రహదారిపై మంగళవారం బైఠాయించారు.

ఈ ఏడాది మిర్చి సాగు చేసిన తమ పరిస్థితి అసలే దయనీయంగా మారిందని, మిర్చిని కొనుగోలు చేసి నగదు ఇవ్వకుండా వ్యాపారి ఇబ్బందులు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తమకు చావు తప్ప మరో మార్గం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పురుగు మందు డబ్బాలు ఓపెన్ చేసి ఆత్మహత్య చేసుకుంటామని రైతులు ప్రతిన బూనడంతో పోలీసులు బలవంతంగా రైతుల వద్ద నుంచి పురుగుమందు డబ్బాలు లాక్కున్నారు. సత్తెనపల్లి టౌన్ సీఐ ఎన్.నాగమల్లేశ్వరరావు, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ అమీనుద్దీన్, పోలీసులు పురుగుమందు డబ్బాలు లాక్కొని రైతులకు సర్ది చెప్పడంతో రైతులు ఆందోళనను విరమించారు.

కూలీలు ఇళ్ల మీదకి వస్తున్నారు



మేము రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాం. 37 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. మిర్చి కోసిన కూలీలకు రూ 3.20 లక్షలు కూలి డబ్బు చెల్లించాలి. మిర్చి అమ్మినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కూలీలు ఇళ్ల మీదకి వస్తున్నారు.

–సత్తెనపల్లి ఈశ్వరమ్మ, మహిళా రైతు, లక్కరాజుగార్లపాడు

వ్యాపారిని పట్టించినా న్యాయం జరగలేదు



నేను 10 ఎకరాలు మిర్చి సాగు చేశాను. వచ్చిన దిగుబడి విక్రయించినా కూడా చేతిలో చిల్లిగవ్వ లేదు. మా దగ్గర మిర్చి కొన్న వ్యాపారి పరారు కావడంతో అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించాం. అయినా మాకు ఇంతవరకు న్యాయం జరగలేదు.

–మక్కెన సురేష్, మిర్చి రైతు, లక్కరాజు గార్లపాడు

ఎన్జీ రంగా అగ్రి వర్సిటీ వజ్రోత్సవాలు ప్రారంభం



వర్సిటీ వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కె.అచ్చెన్నాయుడు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటై 60 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న వజ్రోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. గుంటూరు శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని వర్సిటీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎన్జీరంగా విగ్రహావిష్కరణ చేశారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వర్సిటీ రైతుల కోసం మరిన్ని వంగడాలను తయారు చేయాలని సూచించారు. ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి సాంకేతిక సదస్సును ప్రారంభించి విశ్వవిద్యాలయ ప్రగతిని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ప్రొఫెసర్ విజయ్‌పాల్‌శర్మ, రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ మర్రిరెడ్డి శ్రీనివాస్ నూతన వంగడాలు, పరిశోధనలపై చర్చించారు. సాంకేతిక నిపుణులు పలు అంశాలపై ప్రసంగించారు. మాజీ ఉపకులపతి డాక్టర్ పి.రాఘవరెడ్డి మాట్లాడుతూ 1964 నుంచి నేటి వరకూ విశ్వవిద్యాలయం సాధించిన అభివృద్ధి, కృషిని అభినందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి. శివన్నారాయణ అతిథులను శాలువాలతో సత్కరించారు. విశ్వవిద్యాలయం 60 ఏళ్ళలో సాధించిన ప్రగతికి నిదర్శనంగా ఏర్పాటు చేసిన 150 పరిశోధన, వంగడాలు, ఇతర స్టాళ్లు రైతులు, సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకల్లో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి.రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు, మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు, పి.జె.పి.ఎస్.ఏ.యూ వైస్‌చాన్సలర్ జానయ్య, పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ జె.వి.రమణ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.గోపాల్, ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ టి.సుగుణ, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మాజీ వీసీ డాక్టర్ దామోదర్ నాయుడు,రైతులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాలక మండలి సభ్యులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,27,525
అమ్మకాలు	1,24,819
నిల్వ	52,500

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,200
నంబరు-5	10,000-12,500
273	10,000-12,400
341	10,000-13,200
4884	10,000-11,200
సూపర్-10	10,000-12,400
తాలుకాయలు	4,500-6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,600
షార్క్-1	10,000 - 12,100
బాడిగ-355	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 12,600
ఆర్మూర్	9,800 - 11,200
తాలు	4,500 - 6,500

-కొరిటెపాడు (గుంటూరు)

తెలుగువారందరూ వావిలాలను స్మరించుకోవాలి

- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో వావిలాల 122వ వర్ధంతి



పట్టణంలోని వావిలాల స్మృతివనంలో వావిలాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత, సత్తెనపల్లి మాజీ శాసన సభ్యుడు వావిలాల గోపాలకృష్ణయ్యను తెలుగువారందరూ స్మరించుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య 22వ వర్ధంతిని పురస్కరించుకొని వావిలాల సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాంబాబు మాట్లాడుతూ దేశం కోసం వావిలాల చేసిన పోరాటాలు, ఉద్యమాలు, స్మరించుకోవాలన్నారు. చాలా నిరాడంబరంగా జీవించి ఆంధ్ర గాంధీగా పేరు పొందిన వావిలాల అందరికీ ఆదర్శమని కొనియాడారు. నిత్యం ప్రజలను చైతన్యం చేసి ప్రజాభివృద్ధికై పాటుపడిన వావిలాల మన సత్తెనపల్లి వారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వావిలాల గోపాలకృష్ణయ్య నాలుగు పర్యాయాలు సత్తెనపల్లి శాసనసభ్యుడిగా గెలిచి నిస్వార్థంగా సేవలందించాడన్నారు. రచయితగా, జర్నలిస్టుగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రారంభానికి, గ్రంథాలయ ఉద్యమానికి, తెలుగు భాషాభివృద్ధికి అవిరళ కృషి చేసిన మహనీయుడన్నారు. నేటి శాసనసభ్యులు వావిలాలను స్ఫూర్తిగా తీసుకొని నిజాయితీగా పని చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముందుగా వావిలాల గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వావిలాల మనవడు మన్నవ సోడేకర్ నేతృత్వంలో జరిగిన వర్ధంతిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజ నారాయణ, సీనియర్ నాయకుడు పక్కాల సూరిబాబు, నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, నాయకులు అచ్యుత శివప్రసాద్, గంగారపు అనూష తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడాలి



మాట్లాడుతున్న వక్తలు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ప్రయోజనాలను కాపాడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పెన్షనర్ల బిల్డింగ్‌లో అధ్యక్షులు మానం సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం పల్నాడు జిల్లా శాఖ పెన్షనర్ల సంఘ ఏప్రిల్ నెల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గౌరవాధ్యక్షులు లంకా రంగనాయకులు, కార్యదర్శి సీసీ ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాదు, అసోసియేషట్ ప్రెసిడెంట్ కంచుపర్తి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి పచ్చల నాగభూషణం, ఉపాధ్యక్షులు చేగిరెడ్డి ఈశ్వరరెడ్డి, పూనాటి సుబ్బారావు పాల్గొన్నారు. కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాదు 2024-25 ఏడాదికి ఫైనాన్స్ స్టేట్‌మెంట్‌ను ప్రవేశపెట్టారు. హెల్త్, గుర్తింపు కార్డుల గురించి చర్చించారు.

ట్రక్కు డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి అనుమతులు

స్వీకరించిన రోడ్డు సేఫ్టీ ప్రతినిధులు



పద్మజకు అనుమతి పత్రాన్ని అందజేస్తున్న ఆర్టీఓ సంజయకుమార్

నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రంలో స్థానిక రవాణా శాఖ ఆర్టీవో కార్యాలయం పక్కనే ఏర్పాటు చేసిన ట్రక్కు డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో జిల్లా రవాణా శాఖ అధికారి సంజయకుమార్ అనుమతులు మంజూరు చేశారని ఆ శిక్షణ సంస్థ మేనేజింగ్ పార్టనర్ కనకదుర్గ పద్మజ వెల్లడించారు. అనుమతి పత్రాన్ని మంగళవారం జిల్లా రవాణా శాఖ అధికారి జి.సంజీవ్‌కుమార్, ఎంవీఐ శివనాగేశ్వరరావు, వంశీల చేతుల మీదుగా తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ వెనుకబడిన పల్నాడు జిల్లా ప్రాంతంలో యువతకు స్వయం ఉపాధి కోసం కారు, హైడ్రాలిక్‌తో కూడిన ట్రక్ డ్రైవింగ్ (ట్రాన్స్‌పోర్టు వాహనం) శిక్షణ, లైసెన్స్, ఉపాధి ప్రాతిపదికన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లాలో చదువులేని యువతకు ఉపాధి కొరకు డ్రైవింగ్ శిక్షణ ఇప్పిస్తామని, అదేవిధంగా రోడ్డుసేఫ్టీ ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎస్సీ, ఎస్టీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇస్తామని తెలిపారు.

క్లుప్తంగా

పసుపు ధరలు



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు 779 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

- కొమ్ములు 657 బస్తాలు రాగా వాటి కనిష్ఠ ధర రూ.10,500, గరిష్ఠ ధర రూ.11,275 మోడల్ ధర రూ.11,211 పలికింది.
- కాయలు 122 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,500, గరిష్ఠ ధర రూ.11,275, మోడల్ ధర రూ.11,200 పలికింది. మొత్తం 584.250 క్వింటాళ్లు అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0852 టీఎంసీలకు సమానం.

విడదల గోపి కస్టడీ తీర్పు రిజర్వు

విజయవాడలీగల్: స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని బెదిరించి, డబ్బులు వసూలు చేశారనే అభియోగంపై నమోదైన కేసులో మాజీ మంత్రి విడదల రజిని మరిది విడదల వేణుగోపీనాథ్ (గోపి)ని ఏసీబీ అధికారులు కస్టడీ కోరుతూ న్యాయస్థానంలో పిటీషన్ దాఖలు చేశారు. ఆ పిటీషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత కస్టడీపై తీర్పును బుధవారానికి రిజర్వు చేశారు. ఇదే కేసులో మాజీమంత్రి విడదల రజని, ఆమె పీఏ డి.రామకృష్ణలకు 41ఎ నోటీసులు ఇచ్చి విచారించాల్సిందిగా, అలాగే విచారణకు వారిని సహకరించాల్సిందిగా హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో ఇప్పటికే విడదల గోపీ విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం విదితమే.

రసవత్తరంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు



బండలాగుతున్న ఎడ్లజత

దాచేపల్లి: రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు మంగళవారం రసవత్తరంగా జరిగాయి. ఆరుపళ్ల విభాగంలో జరిగిన పోటీలో ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం కాజీపురానికి చెందిన వేగనాటి ఓసూరరెడ్డి ఎడ్లజత 5వేల అడుగుల దూరం బండలాగి మొదటిస్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా పంగలూరు మండలం పంగలూరుకి చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్ల జత 4,952 అడుగుల దూరం బండలాగి రెండో స్థానం, ప్రకాశం జిల్లా అర్ధవీడుకి చెందిన సూర చైత్రరెడ్డి పూజితరెడ్డి ఎడ్ల జత 4,856 అడుగుల దూరం బండ లాగి మూడో స్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన కావ్యనంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్ నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 4,750 అడుగుల దూరం బండలాగి నాల్గవ స్థానం, పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లకి చెందిన మేక అంజిరెడ్డి ఎడ్ల జత 4,358 అడుగుడుల దూరంబండలాగి ఐదవస్థానం, పల్నాడు జిల్లా గురజాల మండలం అంబాపురంకి చెందిన చుండు అప్పయ్య చౌదరి ఎడ్ల జత 4వేల అడుగుల దూరం బండలాగి ఆరో స్థానం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతవరానికి చెందిన పీవీఆర్ బుల్స్, పెదవల్లి బ్రదర్స్ 3,108 అడుగుల దూరం బండలాగి ఏడో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్ల జతల రైతులకు దాతలు బహుమతులు, నగదు ప్రదానం చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతగా గూడా శ్రీనివాసరావు వ్యవహరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, యలమల నరేష్, అనిశెట్టి శ్రీనివాసరావు, మునగా నిమ్మయ్య, కానుకొల్లు ప్రశాంత్ తదితరులు పర్యవేక్షించారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

బల్లికురవ మండలంలోని వీ.కొప్పరపాడు గ్రామంలోజిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,1116, రెండో బహుమతిగా రూ.15,116, మూడో బహుమతిగా రూ.10,116, నాల్గవ బహుమతిగా రూ.5,116, మ్యాన్ ఆఫ్ ది సిరిస్ బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్టు బౌలర్‌కు బహుమతులు అందజేస్తున్నామని మరిన్ని వివరాలకు బలరాం 7036938516 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఎన్ఆర్‌జీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి సస్పెన్షన్

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి సత్యకృష్ణను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో శివన్నారాయణ మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరం మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధుల్లో అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్‌లో వెలుగులోనికి రావడం జరిగింది. దీంతో సోషల్ ఆడిట్ సిఫార్సు మేరకు తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. తరువాత విచారణ చేయడం జరుగుతుందన్నారు. గతంలో కూడా అవినీతి వల్ల సస్పెండ్ చేశారు. గత ప్రభుత్వంలో మరల ఉద్యోగం పొందడం జరిగింది. మరల సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమం



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి, ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ అండ్ లేబర్ న్యాయమూర్తి బి.రాములు, చైల్డ్ ఫ్రెండ్లీ కోర్ట్ (పోక్సో కోర్టు) న్యాయమూర్తి షమీ పర్వీన్ సుల్తానా బేగంల పరిచయ కార్యక్రమం జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో అన్ని కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రధాన న్యాయమూర్తి న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా కోర్టులోని వాహనాల పార్కింగ్ వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లా కోర్టులోని అన్ని కోర్టులకు కావలసిన వసతులను సమకూర్చి, కోర్టులో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని కోర్టులకు కావలసిన వసతులను సమకూర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా కోర్టులో మహిళా న్యాయవాదులకు బార్ అసోసియేషన్‌లో కావలసిన ఏర్పాట్లను సాధ్యమైనంత మేర సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పురాణం కల్యాణ లేడీ రిప్రజెంటివ్ బార్ అసోసియేషన్‌కు 30 కుర్చీలు అందజేశారు. క్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి 50 కుర్చీలకు కావలసిన నగదు చెక్కును ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగళశెట్టి శివ సూర్యనారాయణకు అందజేశారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు యంగళశెట్టి శివసూర్యనారాయణ మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ రిలేషన్‌కు కావలసిన సహాయ సహకారాలు అందించటానికి న్యాయవాదులు తరఫున హామీ ఇచ్చారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లిఫ్ట్ నుంచి జారిపడి కార్మికురాలు మృతి



మృతి చెందిన కాశమ్మ

మాచర్ల రూరల్: కందిపప్పు మిల్లులో పనిచేస్తూ లిఫ్ట్ నుంచి జారిపడి మహిళ గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 13వ తేదిన మండలంలోని రాయవరం జంక్షన్ సమీపంలోని తపస్వి లక్ష్మీ బాలాజీ డాల్ మిల్లులో పనిచేసే కూరాకుల కాశమ్మ (44) రోజూలాగానే మిల్లులో పనిచేసేందుకు వెళ్లింది. లిఫ్ట్‌లో నుంచి కిందికి వచ్చే సమయంలో బెల్టు తెగి కిందపడిపోయింది. ఈ సమయములో నడుముకు, కాలుకు తీవ్ర గాయమైంది. గాయపడిన ఆమెను మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స జరిపి మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేటలో ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అక్కడ మహిళ కాశమ్మ నడుముకు, కాలుకు శస్త్ర చికిత్స నిర్వహించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న కాశమ్మ సోమవారం సాయంత్రం మృతి చెందింది. కాశమ్మ భర్త నరసింహారావు కరోనా సమయంలో మృతి చెందాడు. మృతురాలు కాశమ్మకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడున్నారు. కాశమ్మ మృతదేహాన్ని మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు రూరల్ ఎస్ఐ రవిబాబు తెలిపారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చీరాల: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చీరాలలో చోటుచేసుకుంది. ఒన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఇంకొల్లుకు చెందిన శివాజి (35) మంగళవారం చీరాలలోని ఓ లాడ్జి సమీపంలో పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో చోరీకి యత్నం


- తలుపుల తాళాలు పగులగొట్టిన దుండగులు
- ఏమీ చోరీ కాకపోవటంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- పక్కనే ఉన్న మరో ఇంట్లో చోరీ

నరసరావుపేటటౌన్: పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి కార్యాలయాన్ని దుండగులు తాళాలు పగులగొట్టారు. అక్కడ విలువైన వస్తువులు ఏమి దొరకకపోవటంతో వెనుదిరిగారు. కార్యాలయం పక్కనే ఉన్న మరో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్ టౌన్‌హాల్ వెనుక ప్రాంతంలో ఏడాది నుంచి జిల్లా ఉద్యాన కార్యాలయం నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే 28వ తేదీ సాయంత్రం కార్యాలయాన్ని సిబ్బంది మూసివేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం సిబ్బంది ఆరె.రతన్ కార్యాలయం తెరిచేందుకు రాగా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. విషయాన్ని ఉద్యాన జిల్లా అధికారి చందలూరి వెంకట రమణారెడ్డికి తెలియజేశాడు. ఆయన అక్కడకు చేరుకొని కార్యాలయంలో పరిశీలించారు. అయితే ఎలాంటి ఫైల్స్, వస్తువులు అపహరణకు గురికాకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఉద్యాన శాఖ కార్యాలయం పక్కనే ఉన్న మరో ఇంటి తాళాలు పగుల గొట్టి ఉండటాన్ని గమనించారు. ఆ రూంలో విద్యార్థి అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నట్లు తెలుసుకున్నారు. స్టూడెంట్ రూంలో చిన్నపాటి వస్తువులు కనిపించకకుండా పోయినట్లు గుర్తించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

శావల్యాపురం: హత్య కేసులో నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా...మండలంలోని శానంపూడి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన అమృతపూడి నాగేశ్వరరావు (36) గతేడాది అక్టోబరు 7వ తేదీన కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి మృతుడి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా విచారణ చేపట్టారు. విచారణలో మృతుడు, వినుకొండ మండలం ఎనుగుపాలెం గ్రామానికి చెందిన దావులూరి వీరబ్రహ్మం కలసి మండలంలోని కారుమంచి గ్రామం అద్దంకి బ్రాంచ్ కెనాల్ కట్టపై అక్టోబరు 7వ తేదీన రాత్రి మద్యం తాగుతున్న సమయంలో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో మృతుడు నాగేశ్వరరావును, వీరబ్రహ్మం కాల్వలోకి తోసి పరారయ్యాడు. మార్టూరు సమీపంలో వలపర్ల కొమ్మినేనివారిపాలెం టి.జంక్షన్ వద్ద మృతదేహం లభ్యమైంది. అప్పట్లో మార్టూరు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. అనంతరం కేసును శావల్యాపురం పోలీసు స్టేషనుకు బదిలీ చేశారు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దావులూరి వీరబ్రహ్మంను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రైల్వే గ్యాంగ్‌మెన్ ఆత్మహత్య



మస్తాన్‌వలి మృతదేహం

సత్తెనపల్లి: రైల్వే గ్యాంగ్‌మన్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో మంగళవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే గ్యాంగ్‌మన్‌గా పనిచేస్తున్న షేక్ మస్తాన్‌వలి (59) కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో మెడ, చేతికి బ్లేడ్‌తో కోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మృతుడికి భార్య కరీమూన్, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య కరీమూను ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

నరసరావుపేటటౌన్: వ్యక్తిని దారుణంగా హతమార్చటంతోపాటు రూ.380 నగదును దోపిడీ చేసినట్లు నేరం రుజువవడంతో నిందితుడు పట్టణానికి చెందిన తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్ల పందికి జీవిత ఖైదు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 2023వ సంవత్సరం మే నెల 9వ తేదీ రాత్రి పట్టణంలోని గాంధీ పార్క్ ఎదుట గల బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద నిద్రిస్తున్న 55 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తిని నిందితుడు ఇటుకరాయితో మోది దారుణంగా హతమార్చాడు. అతని వద్ద నుంచి కొంత నగదు తస్కరించాడు. సంఘటన జరిగిన మరుసటి రోజు 18వ వార్డు వీఆర్వో చల్లా చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు అంకమ్మరావును అరెస్టు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం అప్పటి సీఐ ఎ.అశోక్‌కుమార్ కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువడంతో హత్య కేసులో జీవిత ఖైదు, రూ.10000 జరిమానా, దోపిడీ కేసులో పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించారు. శిక్షను ఏకకాలంలో అనుభవించేలా తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు. నిందితుడు అంకమ్మరావు పలు హత్య, చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

శిరిగిరిపాడు ఎస్సీ కాలనీలో ఇరువర్గాల ఘర్షణ

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు ఎస్సీ కాలనీలో ఇరువర్గాలు ఘర్షణ పడి రాళ్లు రువ్వుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఆరుమళ్ల విజయ్, కొమ్ము బొంగురు మాచర్ల పట్టణంలో సోమవారం రాత్రి పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ పడి దాడులు చేసుకున్నారు. వీరు స్వగ్రామమైన శిరిగిరిపాడులో బంధువులకు సమాచారం అందింది. మంగళవారం ఉదయం ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. మధ్యాహ్నం మరోసారి రాళ్లు వేసుకున్నారు. కాలనీలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలో ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు కాలనీకి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. కాలనీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.